


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

| శనివారం 23 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 355 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## హైదరాబాద్‌లో టెస్లా ఈవీ కార్ల షోరూం ఏర్పాటు దిశగా అడుగులు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 23, ప్రతినిధి: ప్రపంచ ప్రఖ్యాత విద్యుత్ వాహనాల తయారీ సంస్థ Tesla త్వరలో హైదరాబాద్‌లో సేల్స్, సర్వీస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. శుక్రవారం టెస్లా ఇండియా ప్రతినిధులు తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి Duddilla Sridhar Babuతో సమావేశమై రాష్ట్రంలో అమ్మకాలు ప్రారంభించేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణలో విద్యుత్ వాహనాలు, ఇంటెలిజెంట్ మొబిలిటీ వ్యవస్థలకు అవసరమైన అత్యాధునిక సాంకేతికతలతో కూడిన ఎకోసిస్టంను ప్రభుత్వం అభివృద్ధి చేసిందని మంత్రి తెలిపారు. సెమీకండక్టర్ డిజైన్, ఆటోమొబైల్ సాఫ్ట్‌వేర్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డీప్ టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ దేశంలోనే కీలక కేంద్రంగా ఎదుగుతోందన్నారు. హైదరాబాద్‌లో టెస్లా సేల్స్, సర్వీస్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకొచ్చిన టెస్లా ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్, పబ్లిక్ పాలసీ & బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రజత్‌లను మంత్రి అభినందించారు. ఇప్పటికే దేశంలో నాలుగు షోరూమ్‌లను ఏర్పాటు చేసిన టెస్లా తదుపరి కేంద్రంగా హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం సంతోషకరమన్నారు. టెస్లా కేవలం ఈవీ కార్ల కంపెనీ మాత్రమే కాకుండా సాఫ్ట్‌వేర్, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, బ్యాటరీ టెక్నాలజీల్లోనూ ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు తీసుకొచ్చిన సంస్థగా మంత్రి పేర్కొన్నారు. నగరంలోని సెమీకండక్టర్ సంస్థలు తదుపరి తరం ఎలక్ట్రిక్, స్మార్ట్ మొబిలిటీ వ్యవస్థలకు అవసరమైన చిప్స్, సెన్సార్ల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. దేశీయ కార్ల మార్కెట్‌లో ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల వాటా సుమారు 4 శాతం మాత్రమే ఉన్నప్పటికీ భవిష్యత్తులో ఈ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌ను క్లీన్ టెక్నాలజీ, ఆధునిక మొబిలిటీకి ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో టెస్లా అనుబంధ పరిశ్రమల విస్తరణ అవకాశాలను పరిశీలించాలని మంత్రి ప్రతినిధులను కోరగా, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, టీజీఐఐసీ ఎండీ శశాంక్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ప్రత్యేక కార్యదర్శి రఘురామ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత మైదానాలుగా అన్ని స్టేడియాలను తీర్చిదిద్దాలి: శివసేన రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 23, ప్రతినిధి: రాష్ట్రంలోని అన్ని క్రీడా మైదానాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ ఛైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న "క్రీడలు-యువజన వారోత్సవాలు" కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా "సేవ మరియు సహకారం – పరిశుభ్ర తెలంగాణ కోసం యువత" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యువజన మరియు క్రీడాశాఖ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల స్టేడియాల్లో పరిశుభ్రత, హరిత కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర స్థాయి ప్రధాన కార్యక్రమం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించగా యువత, క్రీడాకారులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జీఎంసీబీ స్టేడియం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, జింఖానా మైదానం, సైక్లింగ్ వెలోడ్రోమ్ స్టేడియాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేన రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు, తల్లిదండ్రులు, కోచ్‌లు, సిబ్బంది మైదానాలు మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అన్ని స్టేడియాలను ప్లాస్టిక్ రహిత మైదానాలుగా అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా యువజన క్రీడా వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజల అభిప్రాయాలను సమీకరించి క్రీడలు, యువజన అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందన్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న క్రీడలు-యువజన వారోత్సవాలకు విశేష స్పందన లభిస్తోందన్నారు. యువతతో పాటు క్రీడాకారులు, తల్లిదండ్రులు, సమాజంలోని వివిధ వర్గాల ప్రజలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. సమాజంలోని అన్ని వయస్సుల వారు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకునేలా తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ కృషి చేస్తోందన్నారు. క్రీడాకారులు తమ మైదానాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా క్రమశిక్షణతో పాటు అంకితభావం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ పరిపాలనాధికారి అనిత, ఉప సంచాలకులు రవితేజ, సుజాత, శ్రీనివాస్, స్టేడియం పరిపాలకుడు రవికుమార్, ప్రజాసంబంధాల అధికారి కాలేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ మార్పిడుల్లో అరుదైన మైలురాయిని చేరుకున్న నిమ్స్‌కు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 23, ప్రతినిధి: హైదరాబాద్‌లోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ కిడ్నీ మార్పిడుల్లో దేశంలోనే అరుదైన మైలురాయిని చేరుకుంది. నిమ్స్ యూరాలజీ విభాగం ఇప్పటివరకు 2 వేల కిడ్నీ మార్పిడులు పూర్తి చేసి దక్షిణ భారతదేశంలో అగ్రస్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా కిడ్నీ మార్పిడుల్లో గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ మొదటి స్థానంలో ఉండగా, లూథియానా క్రిస్టియన్ మెడికల్ కళాశాల రెండో స్థానంలో ఉంది. నిమ్స్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ అరుదైన ఘనత సాధించిన నిమ్స్ వైద్య బృందానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వేలాది మందికి నిమ్స్ విశేష సేవలు అందిస్తోందని ప్రశంసించారు. మొత్తం 2 వేల కిడ్నీ మార్పిడుల్లో 1,900 మంది అంటే 95 శాతం మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా చికిత్స పొందడం విశేషమని పేర్కొన్నారు. 2023 జనవరి నుంచి గడిచిన మూడు సంవత్సరాల నాలుగు నెలల వ్యవధిలోనే 500 కిడ్నీ మార్పిడులు పూర్తి చేసి నిమ్స్ మరో రికార్డు సృష్టించిందని అధికారులు వెల్లడించారు.



## సంత్ సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరిన లంబాడ ప్రజాప్రతినిధులు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 23, ప్రతినిధి: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో లంబాడ ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. లంబాడీల ఆధ్యాత్మిక గురువు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ పేరుతో "సంత్ సేవాలాల్ కార్పొరేషన్" ఏర్పాటు చేయాలని వారు ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రస్తుతం ఉన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి ఎస్టీ కమిషన్‌ను వేరు చేసి ప్రత్యేక హోదా కల్పించాలని కోరారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై ముఖ్యమంత్రితో వారు చర్చించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు మురళీ నాయక్, రాందాస్ నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, తెలంగాణ గిరిజన అభివృద్ధి ఆర్థిక సంస్థ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## అదనపు ఆదాయ వనరుల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: భట్టి విక్రమార్క

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 23, ప్రతినిధి: రాష్ట్ర ఆర్థిక పురోగతిని వేగవంతం చేయడంతో పాటు 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన జరిగిన 'ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం' ఉన్నత స్థాయి సమావేశంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అదనపు ఆదాయ మార్గాల అన్వేషణ, వివిధ శాఖల ప్రగతిపై మంత్రుల బృందం అధికారులతో సమీక్ష నిర్వహించింది. బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా నిధుల సమీకరణ జరగాలని, బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవడానికి లీకేజీలను పూర్తిగా అరికట్టాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆదాయ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ముందస్తుగా నిర్దేశించిన కాలపట్టిక ప్రకారమే శాఖల అధికారులు ఆదాయాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా మాధ్యమ సమావేశం ద్వారా పాల్గొనాలని సూచించారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర మంత్రివర్గం గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు మే 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ విలువలు అమలులోకి రానున్నాయని అధికారులు సమావేశంలో వివరించారు. దీని ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశముందని తెలిపారు. పరిశ్రమల శాఖకు సంబంధించిన హిల్ట్ విధాన మార్గదర్శకాలు సిద్ధమయ్యాయని, వాటికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి, హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ, పరిశ్రమలు, రిజిస్ట్రేషన్లు, గనులు, రెవెన్యూ, రవాణా తదితర కీలక శాఖల ఆదాయ లక్ష్యాలు, వనరుల పురోగతిపై మంత్రుల బృందం అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఆర్ అండ్ బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, గనుల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఉపాధ్యక్షుడు మరియు మేనేజింగ్ డైరెక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.



# పర్యాటక శోభ సంతరించుకునేలా స్వామి బావి అభివృద్ధి: జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

సందేశం టైమ్స్, మెదక్, మే 23, ప్రతినిధి: మెదక్ జిల్లాలోని దాయార ప్రాంతంలోని పురాతన స్వామి బావి, దేవాలయాలను పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు పురావస్తు శాఖ అధికారుల సమన్వయంతో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. పర్యాటక వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ ఛైర్మన్ రాధిక భూపతిరాజు, వైస్ ఛైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మెదక్ ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, యువత, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి దాయారంలోని పురాతన కట్టడాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాల్లో స్వామి బావిని పరిశీలించినట్లు తెలిపారు. పురాతన స్వామి బావి, ఆ ప్రాంతంలోని దేవాలయాలకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి తుది మెరుగులు దిద్ది పునరుద్ధరిస్తామని చెప్పారు. భావితరాలకు ఈ చారిత్రక కట్టడాల గొప్పతనాన్ని తెలియజేసే విధంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో పర్యాటక శోభ పెరిగేలా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పర్యాటక ప్రాంతాలకు మౌలిక వసతులు కల్పించేందుకు పర్యాటక, పురావస్తు శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమిష్టి కృషితోనే జిల్లా అభివృద్ధి: కలెక్టర్ ప్రతిమాసింగ్

సందేశం టైమ్స్, మెదక్, మే 23, ప్రతినిధి: అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమిష్టి కృషితోనే జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు రాధిక భూపతిరాజు, లావణ్య, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించడం, స్థానిక అవసరాలు, సమస్యలను నేరుగా తెలుసుకొని అభివృద్ధి కార్యాచరణ రూపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రజల భాగస్వామ్యమే ఈ కార్యక్రమ విజయానికి కీలకమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, జిల్లా స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకోవడం, భవిష్యత్తు అభివృద్ధి మార్గాన్ని ప్రజలతో కలిసి రూపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలని వివరించారు. రైతు భరోసా ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ వ్యవసాయాన్ని బలోపేతం చేస్తున్నామని, అన్నదాత వెంటే ప్రభుత్వం నిలుస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేస్తున్నామని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తూ కుటుంబ ఆర్థిక భారం తగ్గిస్తున్నామని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి, వడ్డీలేని రుణాల ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ కుటుంబ భద్రత కోసం బీమా పథకాలు, భూమి సారాన్ని కాపాడేందుకు పంటల మార్పిడి, లాభదాయక వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. యువత రేపటి నాయకులు మాత్రమే కాకుండా నేటి అభివృద్ధిలో కూడా భాగస్వాములని పేర్కొంటూ యువజన, క్రీడా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసాలకు గురైతే వెంటనే 1930 సహాయ కేంద్రానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు సంక్షేమ పథకాల అమలు, రాబోయే కార్యక్రమాలపై వివరించారు. అనంతరం వైద్యారోగ్య, గృహ నిర్మాణ, గ్రామీణాభివృద్ధి, మహిళా శక్తి, రైతు సేవా కేంద్రం, వెనుకబడిన తరగతుల అభివృద్ధి, ఎస్సీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.



# రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

సందేశం టైమ్స్, మెదక్, మే 23, ప్రతినిధి: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. శుక్రవారం చేగుంట మండలం రెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, జనగణన సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల నుంచి ప్రతి గింజను కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి అపోహలు, ఆందోళనలు పెట్టుకోవద్దని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో రైతుల పక్షాన నిలుస్తుందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సకాలంలో జరుగుతుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ట్రక్కులతో ధాన్యం తరలించే సమయంలో కొనుగోలు కేంద్రానికి సంబంధించిన సిబ్బందిలో ఒకరు తప్పనిసరిగా వెళ్లి అన్‌లోడింగ్ వేగంగా జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. ట్యాబ్ నమోదు ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తే రైతుల ఖాతాల్లో నగదు జమ ఆలస్యం కాదన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని వివరించారు. రైతుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. అనంతరం జనగణన సర్వేను పరిశీలించిన కలెక్టర్ పకడ్బందీగా జనగణన చేపట్టాలని, ఇండ్ల గణనలో సరైన వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి, అధికారులు, స్థానిక తహసిల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా సాంస్కృతిక సంబురాలు



సందేశం టైమ్స్, మెదక్, మే 23, ప్రతినిధి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న యువజన, క్రీడ, పర్యాటక వారోత్సవాల సందర్భంగా శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సాంస్కృతిక సంబురాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ నగేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువతీ యువకులు ప్రదర్శించిన జానపద, ఆధ్యాత్మిక, సంప్రదాయ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఆటలు, పాటలు, ప్రత్యేక ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువజన, క్రీడ, పర్యాటక వారోత్సవాలు ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో యువజన, క్రీడల శాఖ అధికారి రమేష్, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహణ



సందేశం టైమ్స్, చింతకాని, మే 23, ప్రతినిధి: చింతకాని మండలంలోని బస్వాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం టిబి ముక్త్ భారత్ అభియాన్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా క్షయ నివారణ అధికారి ఆదేశాల మేరకు చింతకాని మండల వైద్యాధికారి అల్తాఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా డిజిటల్ హ్యాండిల్ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి, జ్వరం, ఆయాసం వంటి లక్షణాలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. అలాగే సాధారణ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పడటం, అలసట, మెడ లేదా చంకల్లో గడ్డలు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధి పరీక్షలు, మందులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదని, ఇది పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని తెలిపారు. టిబి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రామాన్ని టిబి రహిత గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. గ్రామ సర్పంచ్ ఆవుల నరసింహారావు, గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణలో ముందుండి పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, టిబి సూపర్‌వైజర్ ఇమామ్, రేచల్ రాణి, మహేష్, గంటయ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు జానమ్మ, సుజాత, నాగమణి, రాంబాయి, సంతోష్, జ్ఞానసుందరి తదితరులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం: భక్తుల వీరప్ప



సందేశం టైమ్స్, మెదక్, మే 23, ప్రతినిధి: మెదక్ జిల్లా టేక్మాల్ కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప స్థానిక ఎమ్మార్వోతో ముఖాముఖి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పని కూడా సక్రమంగా చేయలేదని ఆరోపించారు. రైతులను మోసం చేస్తూ ఇప్పటికీ ఒక యూరియా సంచి కూడా అందించలేకపోయిందని విమర్శించారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని పేర్కొంటూ "కాంగ్రెస్ వద్దు... బీఆర్ఎస్ ముద్దు" అంటూ పార్టీ నాయకులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

సందేశం టైమ్స్, ఖమ్మం, మే 23, ప్రతినిధి: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పనిచేస్తేనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలుగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, లక్ష్యాలను ప్రజలకు వివరించేందుకు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభ సమయంలో లబ్ధిదారులు ఎదుర్కొన్న ఇబ్బందులను స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం, ఇందిరా మహిళా శక్తి ద్వారా బ్యాంకు రుణాల కల్పనతో అధిగమించామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఖమ్మం జిల్లాలో పూర్తయ్యాయని వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన ఉద్యోగ మేళాల ద్వారా యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఇటీవల ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు ప్రజలకు మరింత చేరువై సేవలు అందించాలని సూచించారు. జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వేసవి కాలంలో ఎక్కువ సంఖ్యలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విస్తృత స్థాయిలో మొక్కలు నాటడంతో పాటు పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. పారిశుధ్య చర్యలతో సీజనల్ వ్యాధులను తగ్గించవచ్చని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించనున్నట్లు, పాఠశాల విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. వికలాంగ విద్యార్థులకు బ్యాటరీ ఆధారిత వాహనాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా త్వరలో చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల వివరాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ చైర్‌పర్సన్లు, గ్రామ సర్పంచులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## సీతంపేటలో వినూత్న అగ్నిమాపక చర్యలు

సందేశం టైమ్స్, చింతకాని, మే 23, ప్రతినిధి: గ్రామాల్లో తరచూ జరుగుతున్న అగ్ని ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని సీతంపేట గ్రామ సర్పంచ్ ఆళ్ల మణి-పానకారావు వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా గ్రామ స్థాయిలో హై ప్రెజర్ మినీ అగ్నిమాపక యంత్రాన్ని ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎన్నారైలు ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల సీతంపేట గ్రామంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో రైతులు కష్టపడి పండించిన పంటలు కళ్లముందే దగ్ధమవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ ఘటన నేపథ్యంలో గ్రామంలో తక్షణ అగ్నిమాపక చర్యలు చేపట్టేలా స్థానిక స్థాయిలోనే పరిష్కారం కనుగొనే ప్రయత్నం ప్రారంభించారు. సర్పంచ్ ఆళ్ల మణి–పానకారావు, గ్రామ పెద్ద బయ్యాన బాబురావు ఆలోచనతో గ్రామంలోని నీటి ట్యాంకర్‌కు ప్రత్యేక హై ప్రెజర్ మోటార్, అగ్నిమాపక నాజిల్ అమర్చారు. ఈ మినీ అగ్నిమాపక యంత్రం ఏర్పాటుకు కేవలం రూ.30 వేల మాత్రమే ఖర్చు అయ్యిందని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే పెద్ద అగ్నిమాపక వాహనం వచ్చే వరకు ఆలస్యం కాకుండా స్థానిక ట్యాంకర్ల ద్వారానే మంటలను ప్రారంభ దశలో అదుపులోకి తెచ్చేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. సాధారణ అగ్నిమాపక వాహనం సుమారు 25 మీటర్ల దూరం వరకు నీటిని చిమ్మగలిగితే, ఈ మార్పులు చేసిన ట్యాంకర్ సుమారు 15 మీటర్ల దూరం వరకు అత్యంత వేగంగా పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో చిన్నమండవ సర్పంచ్ పర్చ రాంచందర్, పాతర్లపాడు సర్పంచ్ లక్ష్మి-అచ్చయ్య, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.





## పోచారం పరిసరాల్లో మొసలి ఆచూకీ కోసం గాలింపు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 23, టౌన్ ప్రతినిధి: పటాన్‌చెరు పరిధిలోని తెల్లాపూర్ మున్సిపాలిటీ పోచారం పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న మొసలి ఆచూకీ కోసం అటవీ శాఖ అధికారులు శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు వాగులో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొసలి కనిపించిన వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. మంజీరా నదికి అనుసంధానం ఉండటంతో మొసలి తిరిగి నదిలోకి వెళ్లిపోయే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హెల్త్ స్క్రీనింగ్ శిబిరం

సందేశం టైమ్స్, అందోల్, మే 23, ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కౌమార బాలికల కోసం హెల్త్ స్క్రీనింగ్ శిబిరాన్ని శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో బాలికలకు హిమోగ్లోబిన్, షుగర్, ఎత్తు, బరువు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ సోమిరెడ్డి కృష్ణారెడ్డి బాలికలకు ఆరు రకాల పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), మున్సిపల్ కమిషనర్ రవీందర్, ఇంచార్జి సూపరింటెండెంట్ అశోక్, డాక్టర్ నితిన్, డాక్టర్ బాంధవి, మెప్మా టీఎంసీ భిక్షపతి గౌడ్, మెప్మా ఆర్పీలు, ఆశా కార్యకర్తలు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు శుభవార్త.. జొన్నల కొనుగోలు కేంద్రాల ప్రారంభం





సందేశం టైమ్స్, రాయికోడ్, మే 23, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని మార్కెట్ యార్డు, సింగీతం నల్లబల్లి సహకార సంఘంలో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. సుధాకర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి తక్కువ ధరలకు పంటను విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే జొన్నలను విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి క్వింటాల్ జొన్నలకు రూ.3,699 మద్దతు ధర ప్రకటించిందని, ప్రతి ఎకరానికి గరిష్టంగా 10 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల శ్రమకు తగిన గుర్తింపు కల్పించాలనే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జొన్నలను శుభ్రంగా ఆరబెట్టి తీసుకురావాలని, తేమ శాతం తక్కువగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలతో పాటు పంటలకు మద్దతు ధర కల్పించడం ద్వారా రైతులకు అండగా నిలుస్తోందని నాయకులు తెలిపారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఆలయ చైర్మన్ సతీష్ కుల్కర్ణి, మాజీ జిల్లా పరిషత్ సభ్యుడు మల్లికార్జున్ పటేల్, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్, సర్పంచులు గురుదాస్, బస్వరాజ్, మాజీ సర్పంచ్ కేదారనాథ్, మండల అధ్యక్షుడు బాలాజీ నర్సింలు, మాజీ సహకార సంఘ చైర్మన్లు నజీర్ అహ్మద్, నాగశెట్టి, వ్యవసాయ అధికారి సారిక, వ్యవసాయ విస్తరణ అధికారులు, సహకార సంఘ కార్యదర్శులు విజయ్, మహబూబ్, నాయకులు రఫీక్, బాలయ్య, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభంతో మండలంలోని రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, పంటకు సరైన ధర లభించడం ద్వారా రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## జిల్లా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం: కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 23, ప్రతినిధి: జిల్లా సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో క్షేత్రస్థాయి అధికారులు సమష్టిగా పనిచేస్తూ జిల్లాను ముందంజలో నిలపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి నివేదికపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశం స్థానిక రవి మహల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మండల, జిల్లా స్థాయి అధికారులు ప్రజల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు వారికి అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో మహిళా సంఘాలకు స్వంత భవనాలు లేకపోతే సంబంధిత మండల అభివృద్ధి అధికారుల ద్వారా ప్రతిపాదనలు పంపించాలని, వచ్చిన ప్రతిపాదనలకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 370కిపైగా మహిళా సంఘ భవనాల ప్రతిపాదనలు వచ్చాయని, అందులో ఇప్పటికే 200 భవనాలకు పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. మహిళల సౌకర్యార్థం రూ.10 లక్షల వ్యయంతో షెడ్లు నిర్మించుకునే అవకాశముందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు త్వరితగతిన పంపించాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొంటూ జిల్లాలోని 50 మంది ప్రత్యేక అవసరాల పిల్లల కోసం రూపొందించిన 342 ప్రత్యేక పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ పరికరాలను నాణ్యతా ప్రమాణాలతో ప్రత్యేకంగా తయారు చేయించినట్లు వెల్లడించారు. అనంతరం జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు యువతను, విద్యార్థులను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 సహాయ కేంద్రానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు, పిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాలు, షీ బృందాలు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు మరింత సమర్థంగా పనిచేస్తున్నాయని తెలిపారు. అనంతరం జిల్లా పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్‌ను కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులతో కలిసి సందర్శించి సైబర్ నేరాల నివారణ, మహిళా భద్రత, రోడ్డు భద్రతపై రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమం అనంతరం మరణించిన ఇద్దరు ఉద్యోగుల పిల్లలకు కలెక్టర్ కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సన్యాసయ్య, జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణాధికారి శిరీష, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ, జిల్లా అధికారులు, సర్పంచులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## భాగ్యరెడ్డి వర్మ ఆశయాలు యువతకు ఆదర్శం: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 23, ప్రతినిధి: సామాజిక సమానత్వం, విద్యా విస్తరణ, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ ఆశయాలు యువతకు ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్య, ఆత్మగౌరవం, సమాన హక్కుల కోసం భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని, సమానత్వ భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.




## ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహానికి ప్రత్యేక స్టాల్ పరిశీలించిన మంత్రి దామోదర రాజనర్సింహ

సందేశం టైమ్స్, మే 23, ప్రతినిధి: జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించే లక్ష్యంతో గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ సౌజన్యంతో ప్రత్యేక ఆయిల్ పామ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగుకు సంబంధించిన వివరాలను జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు మంత్రి గారికి వివరించారు. రైతులకు స్థిరమైన మరియు అధిక ఆదాయం అందించే పంటగా ఆయిల్ పామ్‌ను ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నదని ఆయన తెలిపారు. రైతాంగాన్ని ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పంట కొనుగోలు చేయడం జరుగుతుందని, పంటకు సంబంధించిన చెల్లింపులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులను, రైతాంగాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు, గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లాలో ఎండల తీవ్రత.. పలు మండలాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 23, ప్రతినిధి: తెలంగాణ అభివృద్ధి ప్రణాళికా సంస్థ విడుదల చేసిన ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాల నివేదిక ప్రకారం సూర్యాపేట జిల్లాలో ఎండల తీవ్రత మరింత పెరిగింది. మే 21 ఉదయం 8.30 గంటల నుంచి మే 22 ఉదయం 8.30 గంటల వరకు నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పలు మండలాల్లో 45 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మునగాల మండలంలో అత్యధికంగా 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మోతె మండలంలోని మామిళ్లగూడెంలో 46.4 డిగ్రీలు, పెన్‌పహాడ్‌లో 46.4 డిగ్రీలు, మఠంపల్లి మండలంలోని పెద్దవీడులో 46.3 డిగ్రీలు, చిలుకూరు మండలంలో 46.3 డిగ్రీలు నమోదయ్యాయి. గరిడేపల్లి, సూర్యాపేట, నూతన్‌కల్, మేళ్లచెర్వు, చింతలపాలెం, తిరుమలగిరి మండలాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హుజూర్‌నగర్, నడిగూడెం, పాలకీడు, నేరేడుచర్ల, చివ్వెంల, జాజిరెడ్డిగూడెం, నాగారం తదితర మండలాల్లో కూడా 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు తీవ్ర ఉక్కపోతను ఎదుర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా వర్షపాతం నమోదు కాలేదని అధికారులు తెలిపారు. తీవ్ర ఎండల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దని, తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్య అధికారులు సూచించారు.

## మైనారిటీ గురుకులాల్లో అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 23, ప్రతినిధి: సూర్యాపేట జిల్లాలోని నాలుగు తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల్లో అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉపాధ్యాయ నియామకాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. పీజీటీ, టీజీటీ, జూనియర్ లెక్చరర్ పోస్టులలో అన్ని సబ్జెక్టులకు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. తుది నియామకాలు ఖాళీల ఆధారంగా చేపడతామని వెల్లడించారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉత్తీర్ణతతో పాటు కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. అదనంగా బీఈడీ పూర్తి చేసి, జూనియర్ కళాశాలలో మూడేళ్ల అనుభవం కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను అవసరమైన ధ్రువపత్రాలతో కలిసి అవుట్‌సోర్సింగ్ సంస్థ హెచ్ కంప్యూటర్ సర్వీసెస్ అండ్ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ, క్లాక్ టవర్, నల్లగొండ లేదా జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయం, సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం, గది నంబర్ ఎఫ్–52, సూర్యాపేటలో మే 27 సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు 9492611057 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## సంక్షేమం–అభివృద్ధి–మహిళా సాధికారికతకు ప్రభుత్వం అండగా కొనసాగుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 23, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కంది సమీపంలోని ఎల్.ఎన్. కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సంక్షేమం, అభివృద్ధి, మహిళా సాధికారత, సామాజిక భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం బలమైన బాసటగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం దూరదృష్టితో నిర్ణయాలు తీసుకుంటోందని, వ్యవసాయ రంగంలో రైతులకు అండగా నిలవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కుటుంబ సంక్షేమానికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అవసరమని, ప్రతి ఒక్కరు ఆత్మగౌరవంతో జీవించేలా నైపుణ్య ఆధారిత విద్యను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో గత ఏడాది వెయ్యి ప్రీ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయగా, అందులో జిల్లాలోనే సుమారు 130 పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు లక్ష్యంగా ఒక్కోటి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాలలను నిర్మిస్తున్నామని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధిగా జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఇందిర శక్తి మహిళా క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, నైపుణ్య శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు 163 కొత్త చికిత్సలను చేర్చినట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 90 శాతం వైద్య సేవలు జిల్లాలోనే అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి 35 కిలోమీటర్లకు ట్రామా కేర్ సెంటర్, ప్రతి 25 కిలోమీటర్లకు డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 9 వేల నర్సింగ్ పోస్టుల భర్తీతో పాటు 16 నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేసినట్లు, మొత్తం 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. సనత్‌నగర్‌లో వెయ్యి పడకల టిమ్స్ ఆసుపత్రిని జూన్ నెలలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. అనంతరం టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ఆరు గ్యారంటీలను ప్రజలకు సమర్థవంతంగా అందిస్తోందని, చెప్పింది చేసి చూపించే ప్రభుత్వంగా ముందుకు సాగుతోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో పారదర్శక పాలన అందించే దిశగా కృషి చేస్తోందని, జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రోత్సాహక బహుమతులు, మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ చెక్కులు, జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముందు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించిన మంత్రి ఆయిల్ పామ్ సాగు, డ్రోన్ సాంకేతికత వంటి అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఏ. ఫహీమ్, అదనపు కలెక్టర్ పాండు, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.